**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**జాతీయ వార్తలు**

**తేదీ: 18.10.2024** **సమయం 19.05 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. ఎన్.డి.ఏ పాలిత రాష్ట్రాలలో పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు సులభతర పరిపాలన, సత్వర నిర్ణయ విధానం, పాలనలో పారదర్శకత దోహద పడతాయని ప్రధానమంత్రి నరేంద్రమోది అన్నారు.
2. మానవహక్కులు ఎల్లప్పుడు భారతీయ నైతికతలో ఇమిడి వున్నాయని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కడ్ అన్నారు.
3. భూటాన్ లో జల విద్యుత్ అభివృద్ధిని మెరుగుపర్చేందుకు భారత్ కట్టుబడి ఉందని కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్ లాల్ స్పష్టం చేశారు.
4. బాల్యవివాహ నిషేధ చట్టం అమలుకు వ్యక్తిగత చట్టాలు, పిల్లలు ఇష్టమైన భాగస్వామిని ఎంచుకునే స్వేచ్ఛ అవరోధం కాకూడదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది.
5. కర్మయోగి శపథ్ – జాతీయ అభ్యసన వారోత్సవాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు కొత్త ఢిల్లీలో ప్రారంభిస్తారు.

**PM:**

ఎన్.డి.ఏ పాలిత రాష్ట్రాలలో పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు సులభతర పరిపాలన, సత్వర నిర్ణయ విధానం, పాలన పారదర్శకత దోహద పడతాయని ప్రధానమంత్రి నరేంద్రమోది అన్నారు. పెరుగుతున్న సామాన్యుల ఆకాంక్షలను ఎన్.డి.ఏ ప్రభుత్వం నెరవేరుస్తోందని, ఈ ఆకాంక్షలను చివరి మైలు వరకు

అందేలా ఎన్.డి.ఏ ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ఇందువల్లే 2014 నుంచి ప్రభుత్వం పట్ల ప్రజల్లో విశ్వాసం వుందని చెప్పారు. ప్రజల సమస్యలకు పరిష్కారాలు కనుక్కోవడమే ఉత్తమ పరిపాలన పరమావధిగా వుండాలని అన్నారు. ఫిర్యాదుల పరిష్కారంపై దృష్టి సారించి, సమస్యలను పరిష్కరిస్తున్న ఎన్.డి.ఏ రాష్ట్ర ప్రభుత్వాలకు గుర్తింపు వుందని అన్నారు. హర్యానా శాసనసభ ఎన్నికల్లో ఎన్.డి.ఏ చారిత్రాత్మక విజయం సాధించిందని నరేంద్రమోది చెబుతూ... ఈ ఎన్నికల్లో సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఎన్.డి.ఏకు మద్దతు ఇచ్చారని చెప్పారు.

ఎస్.ఎస్.డి.

**VP NHRC:**

మానవహక్కులు ఎల్లప్పుడు భారతీయ నైతికత విలువల్లో ఇమిడి వున్నాయని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కడ్ అన్నారు. కొత్త ఢిల్లీలో ఈరోజు జాతీయ మానవ హక్కుల సంఘం వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... మానవ హక్కులకు భారత రాజ్యాంగం దిక్సూచిగా ఉందని అన్నారు. భారత రాజ్యాంగ పీఠికలో మానవ హక్కుల సారాంశంగా ప్రజలందరికీ సమాన న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం హామీ ప్రజలందరికీ వుందని అన్నారు. ఎవరి పట్ల ఏదైనా రూపంలో వివక్ష జరిగితే మానవహక్కుల మూలస్థంభాన్ని కదిలించినట్లేనని ఆయన తెలిపారు. మానవహక్కులను కాపాడడం కంటే మరే గొప్ప విషయం లేదని ఉపరాష్ట్రపతి అన్నారు.

ఎస్.ఎస్.డి.

**INDIA BHUTAN HYDROPOWER:**

భూటాన్ విద్యుత్, సహజ వనరుల శాఖ మంత్రి లింపో జమ్ షరింగ్ ఈరోజు కొత్త ఢిల్లీలో కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్ లాల్ ను కలుసుకున్నారు. జల విద్యుత్ రంగంలో ఇరు దేశాల మధ్య దీర్ఘకాల

సహకారాన్ని బలోపేతం చేసుకోవడంపై ఈ సమావేశంలో దృష్టి సారించారు. పూణా వస్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ ప్రాజెక్టు నుంచి విద్యుత్ శక్తి ఉత్పత్తిని మరింతగా పెంచేందుకు సహకారాన్ని పెంపొందించుకోవడంపై ఇరు పక్షాలు చర్చించాయి. భూటాన్ లో జల విద్యుత్ అభివృద్ధిని మెరుగుపర్చేందుకు భారత్ కట్టుబడి ఉందని కేంద్ర మంత్రి పునరుద్ఘాటించారు. ఈ ప్రాజెక్టులలో కీలకమైన సహకారం, వ్యూహం, పరస్పర ప్రయోజనాలకు భారత్ పూర్తి మద్దతు ఇస్తుందని ఆయన తెలిపారు. జల విద్యుత్ రంగంలో భారత్ – భూటాన్ లు అతి పెద్ద భాగస్వామ్యం పంచుకుంటున్నాయని మా ప్రతినిధి తెలియజేస్తున్నారు. ఈ కీలక ప్రాజెక్టులు భూటాన్ ఆర్థిక వ్యవస్థకు గణనీయంగా దోహదపడుతున్నాయి. భారత్ కు పునరుత్పత్తి ఇంధనాన్ని అందిస్తున్నాయి.

ఎస్.ఎస్.డి.

**SC-CHILD MARRIAGE:**

బాల్యవివాహ నిషేధ చట్టం అమలుకు వ్యక్తిగత చట్టాలు, పిల్లలు ఇష్టమైన భాగస్వామిని ఎంచుకునే స్వేచ్ఛ అవరోధం కాకూడదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. దేశంలో బాల్య వివాహ నిరోధక చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు జేబి పార్ధివాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం మార్గదర్శకాలను సైతం జారీ చేసింది. బాల్యవివాహాలను జరగకుండా చూడాలన్న జాతీయ చట్టం అమలుకు వ్యక్తిగత చట్టాలు అవరోధం కాకూడదని ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ తీర్పు వెలువరిస్తూ చెప్పారు. బాల్య వివాహాలను నిరోధించేందుకు అధికారులు కృషి చేయాలని, శిక్షలు చివరి చర్యగానే చూడాలని తీర్పులో వెల్లడించారు.

**PM-KARMYOGI:**

కర్మయోగి శపథ్ – జాతీయ అభ్యాసన వారోత్సవాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు కొత్త ఢిల్లీలో ప్రారంభిస్తారు. ఈ వారంలో రోజుకు కనీసం నాలుగు గంటలపాటు వృత్తి సామర్థ్యాన్ని సాధించేందుకు ప్రతి కర్మయోగి సంకల్పం తీసుకోవాల్సి ఉంటుంది. వ్యక్తులు, మంత్రిత్వ శాఖలు, సంస్థలు ఈ సామర్థ్య అభ్యసనానికి ఈ వారం రోజులు అంకితం కావాల్సి ఉంటుంది. వెబినార్లు, ఉపన్యాసాలు ప్రముఖ నిపుణులు చేసే విధాన నిర్ణాయక ప్రసంగాలు ఈ సందర్భంగా జరుగుతాయి. ప్రభుత్వ పథకాలను ప్రజలకు సమర్థవంతంగా అందించే విధంగా తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రముఖ వక్తలు వివరిస్తారు.

**KISHAN REDDY-MUSI:**

హైదరాబాద్ మూసీ నది పునర్జీవ అంశంపై తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యల పట్ల ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు అసంతృప్తి వ్యక్తం చేశాయి. మూసీ సుందరీకరణను ఎవరూ వ్యతిరేకించడం లేదని పేదల ఇళ్ల కూల్చివేతను మాత్రమే వ్యతిరేకిస్తున్నామని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ గాంధీనగర్ ప్రాంతంలో మురుగు కాల్వను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూసీ విషయంలో ముఖ్యమంత్రి అనవసరంగా ప్రతిపక్షాలను నిందిస్తున్నారని అన్నారు. మూసీ నదిని సుందరీకరించినా, ముఖ్యమంత్రి ఆ ప్రాంతంలో తన ఇళ్లు నిర్మించుకున్నా అభ్యంతరం లేదని కిషన్ రెడ్డి అన్నారు. మూసీ పరివాహక ప్రాంతంలో ఉన్న పేదలు, మధ్యతరగతి వారి ఇళ్లను కూల్చివేసి రెండు పడక గదుల ఇళ్లు కేటాయిస్తామని ముఖ్యమంత్రి నిన్న విలేకరుల సమావేశంలో ప్రకటించారని, ఎటువంటి సౌకర్యాలు లేని ఆ ఇళ్లతో ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. మురికి కాల్వల సమస్య పరిష్కారం కాకుండా మూసీ సుందరీకరణ, పునర్జీవణం సఫలం కాదని, ప్రజల్లో భయాందోళనలు

రేకెత్తించడానికి బదులు రాష్ట్రప్రభుత్వం కార్యాచరణ ప్రణాళికతో ముందుకు రావాలని కిషన్ రెడ్డి సూచించారు.

GUTTA- MUSI:

ఇలా ఉండగా మూసీ పునర్జీవ పథకాన్ని ప్రతిపక్షాలు వ్యతిరేకించడం సరైనది కాదని రాష్ట్ర శాసన మండలి ఛైర్మన్ గుత్తాసుఖేందర్ రెడ్డి అన్నారు. హైదరాబాదే కాకుండా నల్గొండ జిల్లా ప్రయోజనాల పరిరక్షణకు మూసీ ప్రాజెక్టు తప్పనిసరిగా చేపట్టాలని విలేకరుల సమావేశంలో అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ తప్పుడు నిర్ణయాలను వ్యతిరేకించవలసిందేనని అయితే, మంచి పనులను రాజకీయాలకు అతీతంగా స్వాగతించాలని సుఖేందర్ రెడ్డి తెలిపారు. మూసీ పునర్జీవానికి గత ప్రభుత్వ కాలం హయాంలో ఒక బోర్డును ఏర్పాటు చేసిందని ఆయన తెలిపారు.

TRAI:

భూతల ఆధారిత బ్రాడ్ కాస్టర్ల క్రమబద్ధీకరణ రూపకల్పనపై సంప్రదింపుల పత్రాన్ని భారత టెలికం నియంత్రణ సాధికారత సంస్థ ఈరోజు జారీచేసింది. ఉపగ్రహ టెలిఫోన్ ఛానళ్ళు ఎప్పటికప్పుడు అప్ లింకింగ్ – డౌన్ లింకింగ్ కు సంబంధించి ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది. ఇందులో టివి ప్రసార సేవలకు సంబంధించిన నియమ నిబంధనలు వున్నాయని కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ తెలిపింది. ఉపరితల ఆధారిత సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించి, ప్రాదేశికంగా, డిస్ట్రిబ్యూషన్ ప్లాట్ ఫామ్ ఆపరేటర్లకు టెలివిజన్ ఛానళ్ళను అందించేందుకు వీలుగా బ్రాడ్ కాస్టర్లకు ఈ అధునాతున సాంకేతిక పరిజ్ఞానం వెసులుబాటు కల్పించిందని తెలిపింది.

ఎస్.ఎస్.డి.

**STOCK CLOSE:**

ముంబయి స్టాక్ ఎక్స్చేంజ్ సెన్సెక్స్ సూచి – ఈరోజు 81 వేల 224 పాయింట్ల వద్ద లావాదేవీలు ముగించగా, జాతీయ స్టాక్ ఎక్స్చేంజ్ సూచి నిఫ్టీ 104 పాయింట్లు లాభపడి, 24 వేల 850 పాయింట్ల వద్ద ముగిసింది. భారతీయ స్టాక్ ఎక్స్చేంజీలు గత మూడు రోజుల పాటు నష్టాలు చవిచూసి, ఈరోజు మాత్రం అధిక పాయింట్లతో ముగిశాయి.

**CRICKET-STUMPS:**

బెంగుళూరు చిన్న స్వామి స్టేడియంలో జరుగుతున్న మొదటి టెస్ట్ మ్యాచ్ లో ఈరోజు మూడవ రోజు ఆట ముగిసే సమయానికి భారత్ – న్యూజిలాండ్ పై మూడు వికెట్లు నష్టపోయి 231 పరుగులు చేసింది. భారత్ – న్యూజిలాండ్ కంటే 125 పరుగులు వెనుకంజలో వుంది. విరాట్ కోహ్లీ, సర్ఫరాజ్ ఖాన్ చెరో 70 పరుగులు చేశారు. రోహిత్ శర్మ 52 పరుగులు చేశారు. న్యూజిలాండ్ జట్టులో అజాజ్ పటేల్ రెండు వికెట్లు, గ్లెన్ ఫిలిప్స్ ఒక వికెట్ తీసుకున్నారు. ఇదిలా ఉండగా న్యూజిలాండ్ జరుగుతున్న ఈ తొలి టెస్టులో విరాట్ కోహ్లీ 70 పరుగులు చేయడం ద్వారా టెస్ట్ కెరీర్ లో 9 వేల పరుగులను పూర్తి చేసుకున్నారు. ఈ ఘనత సాధించిన 4వ భారత బ్యాటర్ గా నిలిచారు. గతంలో సచిన్ టెండుల్కర్, సునీల్ గవాస్కర్, రాహుల్ ద్రవిడ్ లు ఈ ఘనత సాధించారు.

ఎస్.ఎస్.డి.

**ASSAM – BYEPOLLS:**

అస్సాంలో 5 శాసనసభ స్థానాల్లో ఉప ఎన్నికలు జరుగుతాయి. ఈమేరకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు, ఈరోజు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైందని ఎన్నికల ముఖ్య అధికారి అనురాగ్ గోయల్ గౌహతిలో

చెప్పారు. ఎపిక్ కార్డుల గురించి ఓటర్లు ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. పోలింగ్ రోజున పాత, కొత్త కార్డులు అందుబాటులో వుంటాయన్నారు. ఈ ఉప ఎన్నికలో 9 లక్షల మంది ఓటు చేస్తారని చెప్పారు.

ఎస్.ఎస్.డి.

**UTTARAKHAND –UCC:**

ఉత్తరాఖండ్ లో మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శత్రుగన్ సింగ్ అధ్యక్షతన ఏర్పడిన UCC నియమ నిబంధనలు అమలు కమిటీ తమ నివేదికను ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామికీ ఈరోజు సచివాలయంలో సమర్పించింది. కేబినెట్ ఈ నివేదికను ఆమోదించిన వెంటనే ఇది చట్టంగా అమలవుతుందని ముఖ్యమంత్రి చెప్పారు. అందరికీ సమానత్వం లభించేందుకు, ఎవరు భయపడాల్సిన అవసరం లేకుండా వుండేందుకు ఈ చట్టాన్ని తీసుకువచ్చినట్టు ఆయన తెలియజేశారు. UCC చట్టంలో ప్రధానంగా నాలుగు భాగాలున్నాయి. వివాహాల నమోదు, విడాకులకు, సహ జీవనానికి, జనన మరణాల నమోదు, వారసత్వానికి సంబంధించి విధివిధానాలున్నాయి.

ఎస్.ఎస్.డి.

**VCs:**

రాష్ట్రంలోని 9 విశ్వవిద్యాలయాల ఉపాధ్యక్షుల నియామకానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులుగా ఆచార్య మెగులరామ్, పాలమూరు విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులుగా ఆచార్య జిఎస్. శ్రీనివాస్, కాకతీయ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులుగా ఆచార్య ప్రతాప్ రెడ్డి, శాతవాహన విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులుగా ఆచార్య ఉమేశ్ కుమార్, తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులుగా ఆచార్య వెలుదండ నిత్యానందరావు, నల్గొండ మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులుగా ఆచార్య అల్తాఫ్ ఉస్సేన్,

నిజామాబాద్ తెలంగాణ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులుగా ఆచార్య యాదగిరిరావు, ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులుగా ఆచార్య అల్దాస్ జానయ్య, కొండాలక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులుగా ఆచార్య రాజిరెడ్డి నియమితులయ్యారు.